సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 20 । జూన్ । 2025



ఉద్యోగులు జాగ్రత్తగా ప్రవర్తించాలి

సచివాలయ ఉద్యోగులు ప్రజలతో జాగ్రత్తగా ప్రవర్తించాలని కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అన్నారు.దాడిలో గాయపడిన బాధితులను పరామర్శించారు. -10లో



అన్నమాచార్యలో న్యాయ కళాశాల

అన్నమాచార్య యూనివర్సిటీలో న్యాయవిద్య అందించేందుకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండి యా అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఏయూ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి తెలిపారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.140	రూ.180
రెండోరకం	రూ.90	రూ.130

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1896 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	405	405
బైవోల్టిన్	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 153.320 కిలోలు

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి జగదాంబసెంటర్: మదనపల్లె మండలం వలసపల్లిలోని పీఎం శ్రీ స్కూల్ జవహర్ నవోదయ విద్యాలయలో 2026–27 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ గీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జులై 29వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిసెంబర్ 13వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 8919956395, 94409 45913, 8074630504‌8 నంబర్లలో సంప్రదించాలని ఆమె తెలియజేశారు.

నేడు ఉచిత నిర్బంధ ప్రవేశాల రెండో లాటరీ ఫలితాల విడుదల

రాయచోటి జగదాంబసెంటర్: విద్యాహక్కు చట్టం ప్రకారం 2025–26 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించిన 25 శాతం ఉచిత ప్రవేశాలకు సంబంధించి లాటరీ విధానంలో రెండో విడత ఫలితాల తుది జాబితా శుక్రవారం విడుదల కానున్నాయి. ఈ విషయాన్ని సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎంపికైన విద్యార్థుల సమాచారం తల్లిదండ్రుల మొబైల్ నంబర్లకు ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తారన్నారు. ఇతర వివరాలు 18004258599 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా తెలుసుకోవచ్చని తెలియజేశారు.

గురుకుల విద్యాలయ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

మదనపల్లె సిటీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి మిగిలి ఉన్న ఖాళీలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమన్వయ అధికారి ఉదయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 9వ తరగతి వరకు (ఇంగ్లీషు మీడియం) ప్రవేశానికి బాలురు, బాలికలు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హులైన వారు ఈనెల19 నుంచి 23 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఈనెల 25న ఉదయం 10 గంటల నుంచి 12 వరకు జరుగుతుందన్నారు. ప్రవేశ పరీక్ష బాలికలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, చిన్నచౌక్,కడప, బాలురకుఅంబేడ్కర్ గురుకులం,రామాపురంలో జరుగుతుందని తెలిపారు.

వైవీయూ దూరవిద్య ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీవోఈ) పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల ఫస్ట్ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను డైరెక్టర్ కె.కృష్ణారెడ్డి ఉప సంచాలకులు డాక్టర్ ఎం .శ్రీధర్‌బాబుతో కలిసి విడుదల చేశారు. గురువారం విశ్వవిద్యాలయంలోని తన చాంబర్‌లో ఫలితాలు విడుదల సందర్భంగా డైరెక్టర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి మాట్లాడారు. పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈ ఏడాది మార్చి 8 నుంచి 13 వరకు నిర్వహించామన్నారు. మొత్తం 8 విభాగాలలో ఎకనామిక్స్ (88.8 శాతం), ఇంగ్లిష్ (96.6 శాతం), హిస్టరీ (66.6 శాతం), మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం (100 శాతం) పొలిటికల్ సైన్స్ (100 శాతం), సైకాలజీ (100 శాతం), స్పెషల్ తెలుగు (86.3 శాతం) కామర్స్ (90.9 శాతం) ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. మొత్తం 144 మంది పరీక్షలు రాయగా అందులో 136 మంది ఉత్తీర్ణత సాధించారని, ఇందులో 104 మంది ఫస్ట్ క్లాస్, 32 మంది సెకండ్ క్లాస్ లో నిలిచారన్నారు.

సాగుకు సిద్ధం..సాయం శూన్యం

వ్యవసాయాన్నే నమ్ముకుని ఆరుగాలం చెమటోడ్చి కష్టపడుతున్న అన్నదాతకు ఆందోళన తప్పడం లేదు. కనీసం ప్రభుత్వాలైనా కష్టకాలంలో స్వాంతన చేకూర్చాలి. రైతును ఆదుకోవడంతోపాటు భరోసా కల్పిస్తే వ్యవసాయాన్ని పండుగలా మారుస్తాడు. గతంలో వైఎస్సార్ సీపీ సర్కార్ హయాంలో ఖరీఫ్ సీజన్‌కు ముందే...ప్రతి ఏడాది మే నెలలో పెట్టుబడి భరోసా నిధులు విడుదల చేస్తూ అన్నదాతకు అండగా నిలిచిన పరిస్థితులు ఉండేవి.అప్పట్లో భూమితోపాటు పాస్ పుస్తకం ఉన్న ప్రతి రైతుకు రైతు భరోసా సొమ్ములు అందాయి. ప్రస్తుత కూటమి సర్కార్ హయాంలో అందుకు విరుద్ధమైన పరిస్థితులు తలెత్తడం ఆందోళన కలిగించే పరిణామం.

- ఖరీఫ్ పనులు ప్రారంభం
- అన్నదాతలను పట్టించుకోని ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి ఏడాది మే నెలలోనే రైతు భరోసా కింద పెట్టుబడి సాయం
- జిల్లాలో 2.30 లక్షల మంది రైతులు
- అన్నదాత సుఖీభవ సాయం కోసం ఎదురుచూపులు

సాక్షి రాయచోటి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. అయినా రైతులకు కూటమి ప్రభుత్వం ఎలాంటి సాయం అందించలేదు.అరక చేతపట్టి పొలంబాట పట్టిన రైతులు దిగాలుగా సాగుకు సిద్ధమయ్యారు. చేతిలో చిల్లిగవ్వ లేక అప్పులు చేసి వ్యవసాయ పనులు మొదలు పెడుతున్నారు. ప్రస్తుత కూటమి సర్కార్ తల్లికి వందనం పథకం అమలు చేసే విషయంలో అనేక నిబంధనలు విధించింది. ఈ కారణంగా చాలామందికి పథకం వర్తించడం లేదు. ఈ నేపథ్యంలో అన్నదాత సుఖీభవ పథకంపై కూడా నీలినీడలు అలుముకున్నాయి. కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు రైతులు ఉన్నా ఒక్కరికే అందిస్తారన్న ప్రచారం సాగుతోంది. అంతేకాకుండా అనేక రకాల నిబంధనలు వర్తిస్తాయని గతంలో ప్రభుత్వ పెద్దలు పేర్కొన్నారు. దీంతో చాలామంది రైతులను ఆర్థికసాయం అందుతుందో లేదోనన్న ఆందోళన వెంటాడుతోంది. కూటమి సర్కార్ మూడు విడతల్లో పెట్టుబడి సాయం అన్నదాత సుఖీభవ పథకం సొమ్ములను అందించే దిశగా కసరత్తు చేస్తున్నారు.



సాగుకు సమాయత్తమవుతున్న రైతులు



వైఎస్ జగన్ సర్కార్ హయాంలో రైతుకు భరోసా



2019లో అధికారంలోకి వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ప్రతి ఏడాది మే నెలలోనే నిధులు విడుదల చేసేవారు. ఎందుకంటే ఖరీఫ్‌లో పంట సాగు మొదలు పెట్టే రైతన్నలకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదన్న ఆశయంతో వైఎస్ జగన్ సర్కార్ పెట్టుబడి సాయం కింద నిధులు విడుదల చేసే పరిస్థితి ఉండేది. జిల్లాలో సుమారు 2.20 లక్షల మంది అన్నదాతలు ఉండగా, దాదాపు అందరికీ అందించే పరిస్థితి ఉండేది. కానీ ప్రస్తుత కూటమి సర్కార్ నిబంధనల సాకుతో కుటుంబంలో ఒక్కరికే అందిస్తారన్న ప్రచారం నేపథ్యంలో ఆందోళన నెలకొంది. ప్రతి ఏడాది ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్నా అనుకున్న సమయంలోనే వైఎస్‌జగన్ సర్కార్ రైతులకు ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయానికి ఆర్థికసాయం అందించి భరోసాగా నిలిచింది.

అన్నదాత సుఖీభవ కోసం ఎదురుచూస్తున్నాం!



అన్నదాత సుఖీభవ కోసం సంవత్సరం పాటు ఎదురు చూస్తూనే ఉన్నాం. రెండో సంవత్సరం ఖరీఫ్ సీజన్ మొదలవుతున్నా ఇంతవరకు అన్నదాత సుఖీభవ డబ్బులు వేయలేదు. మార్కెట్లో ఎరువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసుకోవాలంటే వ్యాపారుల దగ్గర అప్పులు చేసుకుని సేద్యం సాగు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సంవత్సరమైనా ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద నగదు జమ చేసి ఆదుకోవాలి.

– చెన్నకేశవరెడ్డిబాబు, రైతు, చింతకుంటవాండ్లపల్లె, లక్కిరెడ్డిపల్లి మండలం, అన్నమయ్య జిల్లా

భరోసా లేదు



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇప్పటికి ఒక్క విడత కూడా అన్నదాత సుఖీభవ సొమ్ము ఇవ్వలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విత్తనం నుంచి ఎరువుల వరకు రైతు భరోసా కేంద్రాల అందించే వారు.ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వంనుంచి భరోసా లేకపోవడంతో రైతులు వ్యవసాయం చేయాలంటేనే జంకుతున్నారు. ఇప్పటికైనా అన్నదాత సుఖీభవ నిధులు రైతులకు అందించాలి. అన్నదాతకు భరోసా కల్పించాలి.

– ఆవుల చంద్రారెడ్డి, మల్లూరు గ్రామం, చిన్నమండెం మండలం

లాసెట్‌లో మెరిసిన మనోళ్లు

ఒంటిమిట్ట/పీలేరు రూరల్/రాయచోటి జగదాంబ సెంటర్: ఏపీ లాసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మనోళ్లు మెరిశారు. వేర్వేరు విభాగాల్లో 1,2,4 ర్యాంకులు సాధించి భళా అనిపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 5న నిర్వహించిన ఏపీ లాసెట్, ఏపీ పీజీ సెట్–2025 ప్రవేశ పరీక్షల ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఇందులో జిల్లాకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు.

- పీలేరు విద్యార్థిని పల్లపు గిరీష్మ ఎల్‌ఎల్‌బీ ఐదేళ్ల కోర్సులో ప్రథమ ర్యాంక్ సాధించింది. పీలేరులో న్యాయవాదిగా పని చేస్తున్న మండలంలోని ముడుపులవేముల పంచాయతీ రాయలవారిపల్లెకు చెందిన జయశంకర్ కుమార్తె గిరీష్మ.. స్థానిక శ్రీ చైతన్య జూనియర్ కళాశాల సీఈసీ గ్రూపులో ఇంటర్మీడియెట్ పూర్తి చేసింది. ఆమె లాసెట్‌లో 107 మార్కులు సాధించి ప్రథమ ర్యాంకు కైవసం చేసుకుంది.
- ఒంటిమిట్టకు చెందిన వై.లోకేశ్వరి ఎల్‌ఎల్‌ఎమ్ ప్రవేశ పరీక్షలో 120 మార్కులకు 108 సాధించి రెండో ర్యాంకు సాధించింది. హైదరాబాద్‌లోని మియాపూర్‌లో శ్రీ చైతన్య ఐఏఎస్ అకాడమీలో ఇంటర్‌లో చేరి హెచ్‌ఈసీ గ్రూపు తీసుకొని స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించారు. ఇటీవల వైజాగ్‌లోని సెంట్రల్ నల్సార్ దామోదరయ్య. సంజీవయ్య వర్సిటీలో మాస్టర్ ఆఫ్ లా సీటు సాధించారు. ప్రస్తుతం యూపీఎస్సీ ఢిల్లీ అకాడమీ ఆన్‌లైన్ క్లాసుల ద్వారా సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నట్లు తల్లిదండ్రులు వెల్లడించారు.



లోకేశ్వరి

- రాయచోటికి చెందిన వి.రమేష్ ఎల్‌ఎల్‌బీ మూడేళ్ల కోర్సులో 113 మార్కులతో స్టేట్ 4వ ర్యాంకు సాధించారు.



గిరీష్మకు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

అంజన్న హుండీలో డైమండ్



హుండీలో వేసిన డైమండ్

రాజంపేట టౌన్: రాజంపేట పట్టణంలో ప్రసిద్ధిగాంచిన అంజనేయ స్వామి ఆలయంలోని హుండీలో ఓ అజ్ఞాత భక్తుడు ముడి వజ్రాన్ని (డైమండ్) వేసినట్లు రాజంపేట సమూహ దేవస్థానాల ఈఓ కొండారెడ్డి తెలిపారు. హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కిస్తున్న సమయంలో 1.39.6 క్యారెట్ల వజ్రం ఉన్నట్లు ఈఓ తెలిపారు. భక్తుడు వజ్రం టెస్టింగ్ కార్డుతో పాటు ఓ లేఖను కూడా వేశారన్నారు. డైమండ్ తనకు దొరికిందని, దీనిని అమ్మలేక, భరించలేక, వస్తువుగా తయారు చేసి ఇచ్చే శక్తిలేక హుండీలో వేసినట్లు, దీనిని ఉపయోగపడేలా చూడాలని ఆశిస్తున్నట్లు ఆ లేఖలో రాసాడని ఈఓ చెప్పారు. హుండీ ఆదయాన్ని లెక్కించగా నగదు రూపంలో 79,119 రూపాయిలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ జనార్దన్, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మయ్య, ఆలయ ప్రధాన అర్చకులు రవిస్వామి, ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు పబ్బిశెట్టి సుబ్రమణ్యం, కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.

యోగా ఔన్నత్యాన్ని నలుదిశలా చాటుదాం

- జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్
- హార్సిలీహిల్స్‌లో ఘనంగా యోగాంధ్ర కార్యక్రమం



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

బి.కొత్తకోట/కురబలకోట: యోగా ఔన్నత్యాన్ని నలుదిశలా చాటాలని, అందరికీ ఆరోగ్యం యోగా లక్ష్యం కావాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం ఆంధ్రా ఊటీ హార్సిలీహిల్స్‌లో పర్యాటక శాఖ, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌తో కలసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వళన చేశారు. ఈ సంద్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎత్తయిన ప్రదేశం హార్సిలీహిల్స్‌లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం ఆహ్లాదంగా ఉందన్నారు. ప్రపంచానికి మన దేశం అందించిన గొప్ప వరం యోగా అన్నారు. ప్రతి వ్యక్తి జీవితంలో ఇది భాగం కావాలన్నారు. ప్రతి రోజు కొంత సమయం కేటాయించి యోగాసనాలు చేస్తే రుగ్మతలు దూరం అవుతాయని, మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో తొలుత మదనపల్లెలో తర్వాత హార్సిలీహిల్స్‌లో జరపడం సంతోషంగా ఉందన్నారు. ఈనెల 21న రాయచోటిలో ఐదు వేల మందితో నిర్వహించడంతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని హ్యాబిటేషన్లు, గ్రామాల్లో జరపబోతున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వైజాగ్‌లో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొనే యోగాంధ్ర కార్యక్రమం ప్రపంచ రికార్డు సృష్టించనుందన్నారు. అంతకుముందు వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మదనపల్లెకు చెందిన అంతర్జాతీయ యోగా మాస్టర్ పాల్ బ్రహ్మకుమార్ ఆధ్వర్యంలో యోగాసనాలు నిర్వహించారు. జిల్లా పర్యాటక అధికారి నాగభూషణం, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఏడీ సర్వేయర్ భరత్‌కుమార్, తహశీల్దారు బావాజాన్, ఎంపీడీఓ కృష్ణవేణి, ఎంఈఓ రెడ్డి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



హార్సిలీహిల్స్‌లో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో యోగా చేస్తున్న జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

కలెక్టర్‌కు సీఎం అభినందనలు

రాయచోటి: యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణపై జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభినందించారు. గురువారం సాయంత్రం ఈ నెల 21న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించబోయే యోగాంధ్ర 2025 కార్యక్రమంపై ముఖ్యమంత్రి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. యోగా కార్యక్రమంలో భాగంగా నెలవారీగా ఇచ్చిన శిక్షణలు యోగా ట్రైనర్లకు అందించిన సర్టిఫికెట్లు తదితర అంశాలలో జిల్లా మొదటి స్థానంలో ఉన్నందున జిల్లా కలెక్టర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

శివ తాండవ నృత్యానికి ప్రశంస



విద్యార్థులతో కలెక్టర్ శ్రీధర్

బి.కొత్తకోట: స్థానిక విద్యార్థి కాన్సెప్ట్ హైస్కూల్ విద్యార్థులు గురువారం మండలంలోని హార్సిలీహిల్స్‌పై నిర్వహించిన శివ తాండవం నృత్యాన్ని తిలకించిన కలెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రశంసించారు. కొండపై యోగా కార్యక్రమానికి ముందు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు శివ తాండవ నృత్యాభినయం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో కరెస్పాండెంట్ పూజారి రమణ, పూజారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

21న జిల్లా వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమం

రాయచోటి: జిల్లా వ్యాప్తంగా ఈనెల 21వ తేది యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, మండల స్పెషల్ ఆఫీసర్లు తదితర అధికారులతో యోగాంధ్ర కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. యోగాను ప్రజల జీవితంలో భాగస్వామ్యం చేసినప్పుడే యోగాంధ్ర కార్యక్రమం విజయవంతమైనట్లు అవుతుందని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయాలా..వ్యాపార కేంద్రాలా?

- ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో అంతులేని దోపిడీ
- అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫాం, సామగ్రి విక్రయాలు
- తడిసి మోపెడవుతున్న ఖర్చులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు





మదనపల్లె సిటీ: జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కాలేజీల్లో విద్యావ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. ఒకవైపు అధిక ఫీజులతో సతమతమవుతున్న మధ్య తరగతి వర్గాల వారు ఈ ఏడాది భారీగా పెంచిన పుస్తకాల ధరలతో షాక్ అవుతున్నారు. కొన్ని కార్పొరేట్ సంస్థల యజమాన్యాలు సొంత సిలబస్ పేరుతో పుస్తకాలు ముద్రించి విద్యార్థులకు పంపిణీ చేస్తున్నాయి. ప్రభుత్వం ముద్రించిన పుస్తకాల ధరలు రూ.వందల్లో ఉంటే,ప్రైవేట్ విద్యా సంస్థలు ముద్రించిన వాటి ధరలు రూ.వేలల్లో ఉంటున్నాయి. జిల్లాలోని మదన పల్లె, రాయచోటి, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు, వాల్మీకిపురంతోపాటు మండల కేంద్రా లు, మేజర్ పంచాయతీల్లో నిర్వహిస్తున్న పలు ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, ఇతర సామగ్రి అమ్ముతున్న నిర్వాహకులు 1నుంచి 5వ తరగతి వరకు పుస్తకాలకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు, 6 నుంచి 10వ తరగతి వరకు రూ.7,500 నుంచి రూ. 10,500 వరకు వసూలు చేస్తున్నారు. ఇక ఇంటర్మీడియట్‌కైతే ఈ దోపిడీ మరింత ఎక్కువగా ఉంటోంది. నీట్, ఐఐటీ,ఒలింపియాడ్, సీబ్యాచ్, ఎం.బ్యాచ్, టెక్నో వంటి పేర్లతో అదనంగా వసూలు చేస్తున్నారు. బడి బస్సుల ధరలనూ అడ్డగోలుగా పెంచేస్తున్నారని, గత్యంతరం లేక వారు అడిగినంత చెల్లించాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సూపర్ మార్కెట్ తరహాలో..

జిల్లాలో పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో ప్రముఖ కార్పొరేట్ విద్యా సంస్థల బ్రాంచీలన్నీ సూపర్‌మార్కెట్‌లను తలపిస్తున్నాయి. విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రితో స్టోర్లు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు సంబంధించి అన్నివస్తువులూ తమ వద్దే కొనుగోలు చేయాలని హుకుం జారీ చేయడంతో గత్యంతరం లేక తల్లిదండ్రులు వారికి వేలాది రూపాయలు కుమ్మరిస్తున్నారు. ఇదంతా విద్యాశాఖ అధికారులను తెలిసినా పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

గుర్తింపు రద్దు చేయాలి:



నిబంధనలు పాటించని ప్రైవేటు స్కూళ్లు, కాలేజీలపై అధికారులు చర్యలు తీసుకోవాలి. పాఠశాలల్లోనే అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తున్న విద్యా సంస్థల గుర్తింపు రద్దు చేయాలి. ఇలా జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు ఎందుకు కట్టడి చేయడం లేదో వారికే తెలియాలి. ప్రైవేటు విద్యా సంస్థల్లో పుస్తకాలు, అధిక ఫీజుల వసూళ్లపై చర్యలు తీసుకోవాలి.

–నరసింహ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు



మదనపల్లెలోని కార్పొరేట్ పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు (ఫైల్)

చర్యలు తీసుకోవాలి



జిల్లాలో ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల నిర్వాహకులు పలు రకాల ఫీజులతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నారు. ఫీజులు ఇష్టారాజ్యంగా పెంచేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు. విద్యాశాఖ అధికారులు తనిఖీలు నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి.

–మాధవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి



క్లుప్తంగా

యువకుడికి తీవ్ర గాయాలు



బైక్ అదుపుతప్పి తీవ్రంగా గాయపడిన నవీన్

మదనపల్లె రూరల్ : కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం కురబలకోట మండలంలో జరిగింది. బోయపల్లెకు చెందిన నవీన్(27) మిట్స్ కాలేజీలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా, కాలేజీ సమీపంలోని మెయిన్‌రోడ్డుపై అకస్మాత్తుగా కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో నవీన్ తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గంజాయి విక్రేత అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక పాట్టిపాడు రోడ్డులోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో గురువారం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రారెడ్డి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడిలో జమ్మలమడుగులోని సాయిబాబా కొట్టాలు ప్రాంతానికి చెందిన మాలేపాటి సుదర్శన్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 1.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇతను నెల్లూరు జిల్లాలోని ఒక వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసి చిన్న చిన్న పొట్లాల రూపంలో ఇక్కడ విక్రయిస్తున్నట్లు సీఐ తెలిపారు. సుదర్శన్‌పై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు చెప్పారు.

సచివాలయ ఉద్యోగులు జాగ్రత్తగా ప్రవర్తించాలి

- దాడిలో గాయపడిన బాధితులకు కలెక్టర్ పరామర్శ
- విచారణాధికారిగా మదనపల్లె సబ్‌కలెక్టర్



గండువారిపల్లెలో బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్ శ్రీధర్

బి.కొత్తకోట : సచివాలయ ఉద్యోగులు ప్రజలతో జాగ్రత్తగా ప్రవర్తించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. బి.కొత్తకోట మండలం వడిగలవారిపల్లె సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ బాబా ఫకృద్దీన్ గండువారిపల్లెకి చెందిన అనురాధ, నాగభూషణం, శంకరలపై బుధవారం దాడి చేసి గాయపరిచిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై విచారించేందుకు గురువారం జేసీ, సబ్ కలెక్టర్‌తో కలిసి కలెక్టర్ బాధితుల ఇంటికి వెళ్లారు. బాధితులను పరామర్శించారు. జరిగిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరమని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. మీకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని, ఆందోళన చెందవద్దని సూచించారు. దాడికి పాల్పడిన బాబా ఫకృద్దీన్‌పై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. కేసు వివరాలను ఈ మేరకు అడిగి తెలుసుకున్నారు. జరిగిన దాడి, గాయపడటం, దీనికి కారణాలపై విచారణ జరిపి నివేదిక ఇచ్చేందుకు మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ను విచారణ అధికారిగా నియమించారు. బాధితులకయ్యే వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర పథకాలు బాధిత కుటుంబానికి మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. పథకాల మంజూరుపై ఆరా తీసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యకు కారణమైన భూ సర్వే పొరబాట్లపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు సేవలు అందించాల్సిన సచివాలయ ఉద్యోగులు ప్రజల పట్ల గౌరవంగా ఉండాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా మండలంలోని సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి ప్రజల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, దురుసుగా ప్రవర్తించడం చేయరాదని, ఎలా విధులు నిర్వహించాలి, పనితీరు ఎలా ఉండాలని అనే అంశాలపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయ ఉద్యోగుల్లో బాధ్యత పెంచాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ భూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. భూ సర్వే సమయంలో సస్పెండ్ అయిన ఓ సర్వేయర్ విధినిర్వహణలో చేసిన తప్పిదాలతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. భూముల విస్తీర్ణం ఎలా పడితే అలా నమోదు చేయడం, జాయింట్ భూములుగా నమోదు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. దీనిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. కాగా కలెక్టర్ బాధితులను పరామర్శించేందుకు వచ్చినా అక్కడి వీఆర్‌ఓ మల్లికార్జున అందుబాటులో లేకపోవడం, ఆలస్యంగా రావడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ పర్యటనకు వస్తుంటే వీఆర్‌ఓ ఉండనక్కర్లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్ర, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, తహసీల్దార్ బావాజాన్, ఎంపీడీఓ కృష్ణవేణి, అధికారులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వృద్ధురాలు మృతి



రైలు కిందపడి మృతి చెందిన వృద్ధురాలు బొజ్జమ్మ

కలికిరి (వాల్మీకిపురం) : తిరుపతి–గుంతకల్ ప్యాసింజర్ రైలు కింద పడి ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన గురువారం ఉదయం మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు.. వాల్మీకిపురం మండలం చింతలవారిపల్లికి చెందిన కె.బొజ్జమ్మ(80)కు వయస్సు పైబడి మతిస్థిమితం లేకుండా తిరుగుతుంటోంది. ఆమెకు భర్త, కుమార్తె మరణించారు. అల్లుడు వద్ద ఉంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో గురువారం ఉదయం అల్లుడు తన బంధువుల అంత్యక్రియలకు వెళ్లాడు. దీంతో ఇంట్లో నుంచి ఆమె సమీపంలోని రైల్వే ట్రాక్‌మీదకు వెళ్లింది. అదే సమయంలో తిరుపతి నుంచి గుంతకల్ వెళ్లే ప్యాసింజరు రైలు ఢీకొనడంతో ఆమె రెండు కాళ్లు విరిగిపోయాయి. స్థానికుల సమచారం మేరకు ఆమెను 108 సిబ్బంది ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం పెద్దమండ్యం మండలంలో జరిగింది. కనకంటివారిపల్లెకు చెందిన సాంబశివ(25) టెంపో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల కొద్దిరోజులుగా వ్యక్తిగత అవసరాల కోసం పలువురి వద్ద అప్పులు చేశాడు. రుణదాతల నుంచి ఒత్తిడి అధికం కావడంతో మనస్తాపం చెంది గురువారం ఇంటివద్దే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పెద్దమండ్యం పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటించాలి



జీవామృతం విధానాన్ని పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్వీ ప్రవీణ్‌కుమార్

సిద్ధవటం : ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్వీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సిద్ధవటం మండలంలోని టక్కోలు రైతు సేవా కేంద్రం పరిధిలోని ఖాజీపల్లె, డేగనవాండ్లపల్లె, మంగళవాండ్లపల్లె, టక్కోలు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను గురువారం ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్వీ ప్రవీణ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బీజామృతం తయారీ విధానం గురించి సుమలత ఇంటి వద్ద రైతులకు ప్రాక్టికల్‌గా వివరించారు. మంగళవాండ్లపల్లెలో అన్నం శివారెడ్డి పీఎండీఎస్ పొలాన్ని పరిశీలించి సదరు రైతును సిబ్బందిని అభినందించారు. రసాయనిక ఎరువులు, పురుగుల మందులు వాడటం వల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయని, భూసారం క్షీణించి పోతుందన్నారు. బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ మాట్లాడుతూ చిరుధాన్యాల పంటలు సాగుచేస్తూ ఆహారపు అలవాట్లను మార్చుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. జొన్న, సజ్జ, రాగి, కొర్రలు అండు కొర్రలు వంటి చిరు ధాన్యాలు విస్తృతంగా సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టక్కోలు రైతు సేవాకేంద్రం వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మరో యూపీ, బీహార్‌లా ఆంధ్రప్రదేశ్



మాట్లాడుతున్న డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధీర్‌కుమార్

చిన్నమండెం : ఆంధ్ర రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలు చూస్తుంటే ఆంధ్రప్రదేశ్ మరో యూపీ, బీహార్‌లాగా తయారవుతున్నదని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ తెలిపారు. చిన్నమండెం మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో గురువారం ఆయన మాట్లాడుతూ దేశంలో అల్లర్లు, హత్యలు, అత్యాచారాలు అత్యధికంగా జరిగే రాష్ట్రాల జాబితాలో ఉత్తరప్రదేశ్, బీహార్‌లు ఉండగా ఆ రాష్ట్రాలను మించి నేడు రాష్ట్రంలో అధిక సంఖ్యలో అఘాయిత్యాలు జరుగుతున్నాయని అన్నారు. ఇదంతా ప్రభుత్వ వైఫల్యంగా చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, హత్యలు, అత్యాచారాలు దాడులు, దౌర్జన్యాల పట్ల ప్రభుత్వం కఠినచర్యలు తీసుకొని నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రెడ్డి సుధాకర, కార్యకర్తలు పెద్ద గంగులయ్య, శ్రీనివాసులు, పెద్దన్న, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల మాయాజాలం

- భూమి ఒకరిది.. ఆన్‌లైన్ మరొకరికి
- ఓ వృద్ధురాలు ఆవేదన

పుల్లంపేట : పుల్లంపేట మండలం, అప్పారాజుపేట గ్రామానికి చెందిన ముంతాజ్ బేగం తన భర్త నుండి సర్వేనెంబరు 157/1లో 54 సెంట్లు, సర్వే నెంబర్ 156/1లో 1.11 ఎకరాల భూమిని 1984 సంవత్సరంలో కొనుగోలు చేశారు. అయితే రెవెన్యూ అధికారులు తమ భూమిని వేరొకరిపేరుతో ఆన్‌లైన్ చేయడంతో సమస్యను పరిష్కరించాలని రెండు సంవత్సరాల నుంచి తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వీఆర్‌ఓ మల్లికార్జున మాత్రం మొక్కుబడిగా నోటీసులు పెట్టి చేతులు దులుపుకున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరితే చూస్తామంటూ కాలయాపన చేస్తున్నారని, తమ భూమిని వేరుకరి పేరుతో ఆన్‌లైన్ ఎలా చేస్తారని ముంతాజ్ బేగం ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని కోరితే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, జిల్లా అధికారులు తమ భూమిని తమపేరు మీద ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని బాధితురాలు ముంతాజ్ బేగం కోరుతున్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షులు కె. శ్రీనివాస రాజు

రాయచోటి టౌన్ : బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షులు కె. శ్రీనివాస రాజు కోరారు. గురువారం ఎన్‌టీఏ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐడిలు, సిఎఫ్‌ఎంఎస్ అనుసంధాన సమస్యలు లేకుండా ట్రెజరీ అధికారులకు విద్యాశాఖ సమగ్ర నివేదికను పంపాలని కోరారు. కొత్తగా ఏర్పడిన పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు, రీ అపోస్మెంట్ ఖాళీలలో చేరిన ఉపాధ్యాయులకు జూన్ నెల వేతనం సకాలంలో అందేటట్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నాన్ డ్రాయింగ్ సర్టిఫికెట్‌తో కొత్త పాఠశాలలోనే మండలాలలోనే జూన్ మొదటి నెల వేతనం చెల్లించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులకు త్వరలో జరగబోవు కౌన్సిలింగ్‌లో స్థానిక మండలం, సమీపంలోని మండలంలో పోస్టింగ్ ఇచ్చే విధంగా చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీఏ నాయకులు నల్లమల రామాంజులు, ఫకీర, బచ్చల శ్రీనివాసులు, కులశేఖర్‌రెడ్డి, గోవిందు నాగరాజు, చక్రపాణి, భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

అన్నమాచార్య యూనివర్సిటీలో న్యాయ కళాశాల

- బీసీఐ అనుమతి
- విద్యాపరంగా మరో ముందడుగు
- ఏయూ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి



మాట్లాడుతున్న అన్నమాచార్య యూనివర్సిటీ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి

రాజంపేట : అన్నమాచార్య యూనివర్సిటీలో న్యాయవిద్యను అందించేందుకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఏయూ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి, ప్రో చాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డిలు గురువారం ఇక్కడి విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ మూడు సంవత్సరాల న్యాయవిద్య కోర్సు ప్రారంభించేందుకు బీసీఐ అనుమతి రావడం పట్ల వారు హర్షం వ్యక్తంచేశారు. 2025–2026 విద్యాసంవత్సరానికి ఒక సెక్షన్‌లో 60 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తామన్నారు. ఏయూకు మరో గుర్తింపు లభించిందన్నారు. ఏయూ అభివృద్ధిలో మరో అడుగు ముందుకేసిందన్నారు. న్యాయవిద్యకోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా రాజంపేట వాసులకు అందుబాటులో లా కాలేజి రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఏయూ వీసీ డా.సాయిబాబరెడ్డి, రిజిస్ట్రార్ డా.మల్లికార్జునరావు, ఏవో సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం



మాట్లాడుతున్న కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్, జిల్లా అధికారి మధుసూదన్

మదనపల్లె రూరల్ : నాటుసారాను పూర్తిగా నిర్మూలించి, ప్రజారోగ్యాన్ని కాపాడేదిశగా రాష్ట్రప్రభుత్వం చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలుచేసి అన్నమయ్య జిల్లాను సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ అన్నారు. గురువారం స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో నవోదయం 2.0 కార్యక్రమం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ జయరాజ్, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి మధుసూదన్ సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అనుసరించాల్సిన మార్గదర్శకాలను సిబ్బందికి వివరించారు. పాత నేరస్తులు, అనుమానితులపై చర్యలు తీసుకోవాలన్నారు. బీఎన్‌ఎస్‌ఎస్ చట్టం సెక్షన్లు 128, 129 కింద పాత నేరస్తులను హాజరుపరిచి, సత్ప్రవర్తన కోసం బాండ్లు తీసుకోవడంతో పాటు వారిపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. నాటుసారా తయారీకి సంబంధించి ఏ,బీ,సీ కేటగిరీ గ్రామాల్లో ఉన్న పాత నేరస్తులు, అనుమానితులపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. నాటుసారా వృత్తిని మానేసిన వారికి జీవనోపాధికి సంబంధించి ప్రత్యామ్నాయ మార్గాల కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. నాటుసారా నేరాల్లో నిందితులు పట్టుబడినప్పుడు.. ఎవరెవరు తయారు చేశారు? ముడిసరుకులను ఎవరు సరఫరా చేశారు? ఎవరికి తీసుకెళుతున్నారు అనే విషయాలపై పూర్తి దర్యాప్తు చేసి అందరినీ భాగస్వాములుగా గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు మదనపల్లె డివిజన్ పరిధిలో 184 కేసులు నమోదుచేసి, 144 మందిని అరెస్ట్ చేసి, 1047 లీటర్ల నాటుసారాను, 420 కిలోల బెల్లం, 7 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మదనపల్లె డివిజన్ పరిధిలో సారా తయారీ గ్రామాలుగా గుర్తించిన 58 గ్రామాలకు, 32 గ్రామాలను సారారహిత గ్రామాలుగా ప్రకటిస్తున్నామన్నారు. 450 మందిని బైండోవర్ చేసి, ఇందులో 35 బ్రీచ్ ఆఫ్ బాండ్స్‌గా గుర్తించి వారి వద్ద నుంచి రూ.1.90లక్షలు ప్రభుత్వానికి జమచేశామన్నారు. రాయచోటీ ఏఈఎస్ జోగేంద్ర, రవి, సీఐలు భీమలింగ, సుబ్బారెడ్డి, మాధవి, శ్రీలత, ఎస్‌ఐలు జబీవుల్లా, దార్కస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ



ఘర్షణలో గాయపడ్డ నాగ చైతన్య

కేవీపల్లె : ముగ్గురు విద్యార్థులు ఘర్షణ పడి ఓ విద్యార్థి గాయపడ్డ సంఘటన మండలంలోని సారకాయలపేట పంచాయతీ మిన్నంరెడ్డిగారిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. వంకవడ్డిపల్లెకు చెందిన నాగచైతన్య మిన్నంరెడ్డిగారిపల్లెలో ఆరో తరగతి చదువుతున్నాడు. నాగచైతన్య, విజయ్, గణేష్ ముగ్గురు గురువారం మధ్యాహ్నం భోజనం సమయంలో పాఠశాల ఆవరణలో ఘర్షణపడి పరస్పరం ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో నాగచైతన్య కంటిభాగంలో గాయమైంది. దీంతో నాగచైతన్యను చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుర్రంకొండ : పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీ గొల్లపల్లెలో జరిగింది. శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట గ్రామానికి చెందిన నాగార్జున (40)కు మండలంలోని గొల్లపల్లెకు చెందిన అశ్వనితో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. నాగార్జున గత కొంతకాలంగా అత్తవారింట్లోనే ఉంటూ చేనేత మగ్గాల పనిచేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అప్పుల బాధతో పాటు చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో ఈనెల 16వ తేదీన ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి కడప ఆస్పత్రికి తరలించారు. గత మూడు రోజులుగా చికిత్స పొందుతూ గురువారం నాగార్జున మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ గజేంద్ర తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం



అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ మల్లారపువాండ్లపల్లె నల్లగుట్ట క్రాస్ వద్ద దళితుల హౌసింగ్ కాలనీ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు బుధవారం రాత్రి పాక్షికంగా ధ్వంసం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే బుధవారం రాత్రి దుండగులు ధ్వంసం చేసి కిందపడేశారు. విషయం తెలుసుకున్న ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు ముల్లంగి చంద్రయ్య గురువారం జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో తహశీల్దార్ నరేంద్రకుమార్, వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు, ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ గతంలో కూడా కేవీపల్లెలో అంబేడ్కర్ విగ్రహం చూపుడు వేలు ధ్వంసం చేశారని, ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. ఈ ఘటనలో అయినా అధికారులు నిందితులపై కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంజనేయులు, మల్లికార్జున, శేషాద్రిబాబు, పి.వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రేమ విఫలం.. యువకుడు ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న యువకుడు చెప్పాలయ్య

రాజంపేట : ప్రేమ విఫలం కావడంతో కమలాపురానికి చెందిన మామిళ్ల చెప్పాలయ్య అనే యువకుడు ఆత్మహత్యకు యత్నించిన సంఘటన గురువారం రాత్రి రాజంపేట పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని భవానీనగర్‌లోని తన వదిన ఇంట్లో చెప్పాలయ్య బ్లేడ్‌తో గొంతుకోసుకుని ఆత్మహత్య యత్నం చేశాడు. ముఖం, గొంతుపై బ్లేడుతో కోసుకోవడంతో రక్తగాయాలు అయ్యాయి. ఆ యువకుడిని చికిత్స నిమిత్తం రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. పట్టణ పోలీసులు ఈ సంఘటనపై విచారణ చేస్తున్నారు. ప్రేమించిన యువతిది కమలాపురం, రాజంపేటా అనేది తెలియడం లేదు. రాజంపేటకు వచ్చి ఆత్మహత్య యత్నం చేసుకున్న సంఘటన సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో సత్రం దగ్గర గురువారం ద్విచక్ర వాహనాన్ని డీసీఎం వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. లింగాల మండలం అంబకపల్లె గ్రామంలో నివాసముంటున్న నరేంద్రారెడ్డి, కుళ్లాయప్పలు వ్యవసాయ పనులు చేసేందుకు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. పనుల నిమిత్తమై గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో అంబకపల్లె గ్రామం నుంచి పులివెందులకు వస్తుండగా సత్రం బడి వద్ద పులివెందుల నుంచి నల్లపురెడ్డిపల్లె వైపు వెళ్తున్న డీసీఎం వ్యాను ఢీకొంది. ఈ సంఘటనలో నరేంద్రారెడ్డి(32) అక్కడికక్కడికే మృతి చెందగా.. కుళ్లాయప్ప అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం 108 వాహనంలో కడప రోడ్డులో ఉన్న పులివెందుల ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నల్ల గంగమ్మ రోడ్డు బిల్లుకు జీఎస్టీ ఎగనామం

- రూ. కోటి 40 లక్షలకు జీఎస్టీ లేకుండానే నిధులు డ్రా
- బిల్లు చెల్లింపుపై తలలు బాదుకుంటున్న అధికారులు
- మంత్రి పీఏ ఒత్తిడితోనే ఇలా..

టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి సంపాదనే ధ్యేయంగా అధికార పార్టీ నాయకులు అధికారులపై పెత్తనం చెలాయిస్తున్నారు. చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపులో నిబంధనల మేరకు చెల్లించాల్సిన జీఎస్టీ కూడా చెల్లించకుండా నిధులు డ్రా చేయడంపై అధికారులు తలలు బాదుకుంటున్నారు. జీఎస్టీతో సంబంధం లేకుండా మంత్రి పీఏ తనకున్న రాజకీయ పలుకుబడితో సంబంధిత అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు విమర్శలు ఉన్నాయి. జీఎస్పీ లేకుండా నిధులు డ్రా చేయడంతో ప్రభుత్వానికి అందాల్సిన 15 శాతం అంటే రూ. 20 లక్షలను దక్కనీయకుండా చేశారు. ఇందుకు అధికారులు కూడా చేసేదిలేక బిల్లులు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

సంబేపల్లి మండల పరిధిలోని నల్ల గంగమ్మ ఆలయం వద్దకు రూ.కోటి, 70 లక్షలతో సిమెంటు రోడ్డును నిర్మించారు. ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించి మొదటి విడతగా రూ.కోటి 40 లక్షలను డ్రా చేశారు. బిల్లు చెల్లింపులో ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీ చెల్లించకుండానే మంత్రి పీఏ తనదైన పలుకుబడితో నిధులు డ్రా చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. గత వైఎస్‌ఆర్‌సీపీ పాలనలో రూ. కోటి 70 లక్షలతో నిర్మించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అప్పట్లోనే రూ. 50 లక్షలు ఖర్చు చేసి మట్టి రోడ్డును పూర్తి చేశారు. మట్టి రోడ్డు నిర్మాణానికి ఒక్క రూపాయి బిల్లు చెల్లించలేదు. కూటమి పాలన అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి పీఏ తన రాజకీయ అండతో పనిని దక్కించుకొని సిమెంటు రోడ్డును పూర్తి చేశారు. సాధారణంగా పనిని దక్కించుకున్న అగ్రిమెంట్ చేసుకునే వ్యక్తికి బ్యాంక్ అకౌంట్, పాన్ కార్డు, ఆధార్, జీఎస్టీ తప్పక ఉండాలి. కానీ గంగమ్మ దేవత ఆలయం వరకు నిర్మించిన రోడ్డు కాంట్రాక్టర్ కొండేటి శ్రీనివాసులు పేరున ఎలాంటి జీఎస్టీ లేకుండా నిబంధనలు పాటించకుండా అగ్రిమెంట్ చేసి పనులను పూర్తి చేశారు. పనులకు సంబంధించిన రూ. కోటి 40 లక్షలు బిల్లును బ్యాంక్ నుంచి డ్రా చేసిన ఉదంతం అన్నమయ్య జిల్లా కేంద్రంలో చక్కర్లు కొడుతోంది. స్వయాన రాష్ట్ర రవాణ యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పీఏ రెడ్డి కుమార్ ఈ దోపిడీకి పాల్పడటంపై పెద్దఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. సంబేపల్లి గ్రామ పరిధిలో ఇదే పనితో పాటు బొగ్గులవారిపల్లి గ్రామంలో రూ. 50 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులను పూర్తి చేశారు. ఈ పనులను చేపట్టిన కాంట్రాక్టర్ పేరున నమోదైన అగ్రిమెంట్‌లో జీఎస్టీ నెంబర్ చూపించారు. మంత్రి ఏపీ చేపట్టిన పనులకు మాత్రం జీఎస్టీ చూపించకుండానే అగ్రిమెంట్ చేసి బిల్లులు మింగేశారు. దీంతో ప్రభుత్వానికి అందాల్సిన 15 శాతం నిధులు అంటే రూ. 20లక్షలు దక్కకుండా పోయాయి. జీఎస్టీ లేకుండా బిల్లులు చెల్లింపుపై సంబంధిత అధికారులను ప్రశ్నిస్తే తామేమి చెప్పలేమంటూ సమాధానాలను దాటేస్తున్నారు.

చెట్టును ఢీకొన్న కారు

ముద్దనూరు : మండలంలోని కొత్తపల్లె సమీపంలో గురువారం ఓ కారు చెట్టును ఢీకొంది. బాధితుల సమాచారం మేరకు.. కడప నుంచి ముద్దనూరుకు రెండు కార్లు ముందు వెనుక ప్రయాణిస్తున్నాయి. కొత్తపల్లె సమీపంలోకి రాగానే వేగం అదుపు తప్పడంతో ఒక కారు రహదారి పక్కనున్న చెట్టును ఢీకొంది. కారు ముందు భాగం దెబ్బతింది. ఎవరికీ గాయాలు కాలేదు

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED
WANTED FEMALE TEACHERS to teach Lower Classes 1st to 6th all Subjects. Qualified Teachers can apply. Far away Candidates will be provided Food and Accommodation.
LITTLE FLOWER'S E.M.SCHOOL
Gurramkonda,
9441116657,9666933101

NARAYANADRI
INSTITUTE OF SCIENCE AND TECHNOLOGY
WALK-IN INTERVIEW
Eligible and interested candidates can send resumes for the post of ... for the following departments send resumes to college email id : careers.nist@gmail.com

Department	Qualification
CSE, ECE	B.Tech/ M.Tech/ MCA/MSc Comp
Math's, Physics, Chemistry, English	MSc/ MA
Lab Programmer	Any Degree in Computers
Engineering Drawing	MEC/Civil

Admissions are in Progress B.Tech & Diploma
Principal 9985077866

WANTED TEACHERS
Urgently Required Teachers for IIT & NEET Foundation Program for VI to X Classes
Maths, Physics, Chemistry, Biology
Salary Negotiable (Free Food & Accommodation)
Whatsapp your resumes to 9182419990, 9440784735
TA and DA will be provided for those who are selected for the interview.
ST.MARK'S EM HIGH SCHOOL
PAMURU, PRAKASAM (Dt).

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
VOCATIONAL COURSES
LM&D (డ్రైవింగ్ & పశువిద్య), MLT, MPHW(F), C&T కోర్సులకు 2025 సం॥ అడ్మిషన్స్ జరుగుచున్నవి. అర్హత : 10th ఆపైన, హాస్టల్ కలదు. సెల్: 9985566783.

SERIVCES
BOREWELLS
బోర్ పాయింట్ చూడబడును. జై గురుదత్త K.V రమణ M.Sc geologist భూగర్భ జల పరిశోధన సెల్ : 6302328007.

LOST
అన్నమయ్య జిల్లా రాజంపేట పట్టణం ఉస్మాన్ నగర్ కు చెందిన సన్నమేలం నరసింహులు భార్య సన్నమేలం సుజాత అను నేను 20-05-2025వ తేదీన మా స్వగృహం నుండి పాత బస్సు స్టాండ్ కు ఆటోలో వెళుతుండగా నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ M7084506 పోయినది. దొరికిన వారు తెచ్చి ఇవ్వ వలసినదిగా విజ్ఞప్తి. కాంటాక్ట్ నెంబర్: 9030120738.

LOST
కొట్లూరు రామసుబ్బారెడ్డి S/O కె.బాల నారాయణరెడ్డి డోర్ నెం.1/60, చిన్నదండ్లూరు గ్రామం, ఆర్డిపిపి దగ్గర, ఎర్రగుంట్ల మండలం, వై.యస్.ఆర్. కడప జిల్లా.సెల్ డీడ్ డాక్యుమెంట్ నెం:992/2004 (తేది:04-10-2004) గల ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్స్ ఇంటి దగ్గర నుంచి ఆర్డిపిపికి వెళ్ళుతుండగా మధ్యలో పోయినవి. దొరికిన వారు తెలుపగలరు. 9246498998

CHANGE OF NAME
కుడమల కృష్ణారెడ్డి S/O కుడమల గోపాల్ రెడ్డి అను నా పేరును కుడమల రామ కృష్ణ రెడ్డి (S/O) కుడమల గోపాల్ రెడ్డి గా మార్చుకోబడినది. రెసిడెన్స్ ఆఫ్ బొవిళ్ళ వారి పల్లి విలేజ్ చెన్నంపల్లి పోస్ట్ బద్వేల్ పిన్ :516227

NEMMIKANTI LAKSHMI NARAYANA ACHARI R/O 7/308 69-2,Andhra kesari Road, Srinivasa Nagar, Near 3 Town Police Station, Proddatur Town & Mandal, YSR Kadapa Dist, Andhrapradesh-516360. Previously my son in law name as mitansh Kumar achari kamsala (Old Name). Now change my son in law name as Kamsala vamsi Krishna achari (New Name)

WANTED
కష్టపడేవారికి VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవ డానికి స్త్రీలు/పురుషులు ఆయా,నర్సులు,వంట వారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు- 40 వేలు,ఫ్రీరూం+భోజనం.HYD.Ph:7993583999

గమనిక